తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు: తుమ్మల నాగేశ్వరరావు 2

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 18 ఆదివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 11 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SUNDAY OCTOBER 18 2026 | VOL:1 | ISSUE: 11 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి



రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర.. చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు

- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ
- గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం
- తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీట (మిగతా 2వ పేజీలో..)



అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం: పొన్నం ప్రభాకర్

- రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తామని మంత్రి పొన్నం హామీ
- అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తామని వెల్లడి
- సీసీఎస్ బకాయిల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి

తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు (మిగతా 2వ పేజీలో..)





కేరళ మాజీ సీఎం విజయన్ ఇంటికి నోటీసులు అతికించిన ఈడీ

- మనీలాండరింగ్ కేసులో పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు
- అక్టోబర్ 23న కొచ్చిలో విచారణకు హాజరుకావాలని ఆదేశం
- కుమార్తె కంపెనీకి అక్రమ చెల్లింపుల కేసులో విచారణ

కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. (మిగతా 2వ పేజీలో..)

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- నేడు బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రో దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు (మిగతా 2వ పేజీలో..)



తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో (మిగతా 2వ పేజీలో..)



బీజేపీ ఓటు రాజకీయాల కోసం డైవర్షన్ పాలిటిక్స్!

- మోదీ ప్రభుత్వంపై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు
- చైనా ఆక్రమణలపై ప్రధాని మౌనమెందుకు?
- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతుపై ఆశాభావం
- ఇండియా కూటమి పార్టీల మద్దతు కూడగడతాం

హైదరాబాద్, అక్టోబర్ 17:

బీజేపీ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడల్లా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ప్రయత్నిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ (మిగతా 2వ పేజీలో..)

భూసర్వేలో పారదర్శకతకు పెద్దపీట!



- రీసర్వేకు ముందు భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలి
- మూడు దశల్లో సమగ్ర భూసర్వే ప్రక్రియ
- తొలి దశలో 2,720 గ్రామాల్లో సర్వే పూర్తి
- ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ ఐడీ
- అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- కొంగరలో 665 ఎకరాల్లో వందశాతం రీసర్వే పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 17: రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీసర్వే ప్రక్రియలో భూ యజమానుల హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలని, సర్వే చేపట్టే ముందు సంబంధిత యజమానులకు నోటీసులు అందజేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములతో పాటు గ్రామకంఠాల హద్దులను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. (మిగతా 2వ పేజీలో..)

సీఈసీని వెంటనే తొలగించాలి.. డీఎంకే తీర్మానం..!

ణవీఖ : తమిళనాడు లోని ప్రతిపక్ష డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఈవీఎంల స్థానంలో తిరిగి బ్యాలెట్ విధానాన్నే ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'లెహ్రా దో తిరంగా' యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

సీఈసీని వెంటనే తొలగించాలి.. డీఎంకే తీర్మానం..!

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా తీర్మానించారు. ఇవాళ (శనివారం) ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలనేది వాటిలో ఒకటి.సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలనేది వాటిలో తొలి తీర్మానంగా ఉన్నది. ఎన్నికల నిర్వహణలో ఆయన వైఫల్యం చెందారని ఆరోపిస్తూ.. ఆయనను వెంటనే తొలగించాలని ఆ తీర్మానంలో డిమాండ్ చేశారు. అయితే ఎలాంటి అవకతవకలు జరిగాయనేది మాత్రం పార్టీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. అయితే రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంలో పూర్తి వివరాలు పొందుపరచనున్నట్లు తెలుస్తున్నది. విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ డీఎంకే మరో తీర్మానం చేసింది. అయితే ఏ విద్యార్థి సంఘాలకు వారు మద్దతిస్తున్నారో స్పష్టంగా తెలియజేయలేదు. ఇక కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ మూడో తీర్మానం చేసింది. ఏయే అంశాల్లో ఈ పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయో కూడా తీర్మానంలో వివరించలేదు. ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని రాష్ట్రపతిని కోరుతూ నాలుగో తీర్మానం చేశారు.

తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు: తుమ్మల నాగేశ్వరరావు

తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.



తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర.. చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

* విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం: పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు. వారి పెండింగ్ బకాయిలను వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ భూములను విక్రయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సుమారు 17,000 మంది రిటైర్డ్ ఉద్యోగులకు రూ.980 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు గతంలో సంఘాలు వెల్లడించిన నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

కేరళ మాజీ సీఎం విజయన్ ఇంటికి నోటీసులు అతికించిన ఈడీ

(మొదటి పేజీ తరువాయి)

కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్)కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా అక్టోబర్ 23న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. విజయన్ ఇంట్లో అందుబాటులో లేకపోవడంతో, అధికారులు ఆయన నివాసం గోడకు నోటీసును అంటించారుఈరోజు కొచ్చి నుంచి వచ్చిన ఈడీ అధికారులు తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్ వద్ద ఉన్న పినరయి విజయన్ నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేకపోవడంతో, అక్కడి సిబ్బంది నోటీసులు తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో, అధికారులు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద జారీ చేసిన సమన్లను ఇంటి ప్రవేశ ద్వారం వద్ద అతికించి వెళ్లారు.విజయన్ కుమార్తె వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనే కంపెనీకి ఐటీ సేవల పేరుతో సీఎంఆర్ఎల్ సుమారు రూ. 2.78 కోట్లు అక్రమంగా చెల్లించిందనే ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే విజయన్‌ను విచారించాలని నిర్ణయించింది.అయితే, ఈడీ చర్యను సీపీఎం సీనియర్ నేత వి. శివన్‌కుట్టి తప్పుపట్టారు. విజయన్ కన్నూర్‌లో పార్టీ సమావేశంలో ఉన్నారని, ఆయన పరారీలో లేరని స్పష్టం చేశారు. ఆచూకీ లేనప్పుడు నోటీసులు అంటించడం చట్ట ప్రకారం సరైనదే అయినా, ఆయన ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలిసినప్పుడు ఈ విధానం సరికాదని ఆయన విమర్శించారు.

భూసర్వేలో పారదర్శకతకు పెద్దపీట!

(మొదటి పేజీ తరువాయి)

మూడు దశల్లో సమగ్ర భూసర్వే

సమగ్ర భూసర్వే పురోగతిపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా భూములకు సంబంధించిన వివాదాలను తగ్గించి, భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మూడు దశల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతుందని, తొలి దశను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

2,720 గ్రామాల్లో సర్వే పూర్తి

తొలి దశలో భాగంగా ఇప్పటికే 2,720 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయినట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులను నిర్ణయించడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే భూ వివాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సర్వే సందర్భంగా భూముల వాస్తవ పరిస్థితులు, రికార్డుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ ఐడీ

రీసర్వేలో గుర్తించిన ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల కొలతలు తీసుకోవడంతో పాటు, సంబంధిత వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ఈ సమాచారాన్ని భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూ రికార్డుల నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చనున్నట్లు వివరించారు.

భూ యజమానుల అభ్యంతరాలకు అవకాశం

భూసర్వే పూర్తయిన తర్వాత రికార్డులపై భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించాలని మంత్రి అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో భూ యజమానులకు ముందస్తు సమాచారం అందించడం, హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటించడం, అభ్యంతరాలను పరిశీలించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ

పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాలను పంపిణీ చేయనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలో 665 ఎకరాల విస్తీర్ణంలో వందశాతం భూ రీసర్వే పూర్తయినట్లు తెలిపారు. సమగ్ర సర్వే ద్వారా భూముల హద్దులు, రికార్డుల్లో స్పష్టత తీసుకొచ్చి ప్రజలకు భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఊరట కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

బీజేపీ ఓటు రాజకీయాల కోసం డైవర్షన్ పాలిటిక్స్!

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. విదేశీ శక్తుల అంశాలను తెరపైకి తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలు, దర్యాప్తు సంస్థల చర్యలు, ఎన్నికల ప్రక్రియపై ఆయన పలు విమర్శలు చేశారు.

చైనా ఆక్రమణలపై మోదీ మౌనమెందుకు?

చైనా భూఆక్రమణల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు స్పష్టంగా మాట్లాడటం లేదని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. దేశంలో నెలకొన్న సమస్యలపై సమాధానాలు చెప్పకుండా ఇతర అంశాలను తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓటు హక్కులను తొలగిస్తున్నారని బీజేపీపై ఆరోపణలు చేశారు. బీజేపీ వ్యవహారశైలి తప్పు చేసినవారిని పట్టుకున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.

ప్రతిపక్ష నేతలపైనే ఈడీ దాడులా?

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు ప్రతిపక్ష పార్టీల నాయకులపైనే ఎందుకు జరుగుతున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థల చర్యలు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగపడుతున్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలపై అభ్యంతరాలు

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఎంపికైన సమయంలోనే ఎన్నికల ప్రక్రియపై రాహుల్ గాంధీ ఆందోళనలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు.

ఓటు చోరీతో గెలవాలని చూస్తున్నారు



ప్రజల మద్దతుతో గెలవలేక ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారని బీజేపీపై మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు చేశారు. పెద్ద రాష్ట్రాల్లో ఓట్ల అక్రమాల సమస్య ఎక్కువగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచి, ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతుపై ఆశలు

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్, సీపీఎం కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సమావేశం అనంతరం ఆ పార్టీ తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇండియా కూటమి పార్టీలతో సమన్వయం

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

దండారి ఉత్సవాలకు కమ్యూనిటీ షెడ్లు!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా మంజూరుకు మంత్రి జూపల్లి హామీ

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ముందడుగు

ఆదిలాబాద్ (ప్రజానేస్తం జ్వాల):

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారి (గుస్సాడి) ఉత్సవాల నిర్వహణకు కమ్యూనిటీ షెడ్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దండారి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించాలని కోరుతూ ఆదిలాబాద్ మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాబూరావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

నియోజకవర్గాల వారీగా షెడ్ల మంజూరు

దండారి (గుస్సాడి) ఉత్సవాలు ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, తరతరాలుగా వస్తున్న ఈ కళారూపాలను కాపాడుకోవడానికి శాశ్వత వసతులు అవసరమని నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉత్సవాల నిర్వహణకు అనువుగా దండారి కమ్యూనిటీ షెడ్లను రాష్ట్ర సాంస్కృతిక శాఖ ద్వారా మంజూరు చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అవసరమైన షెడ్ల వివరాలతో జాబితాను తెప్పించి, వాటి మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో దండారి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన వసతులు సమకూరుతాయని ఆదివాసీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



మంత్రికి సన్మానం.. కృతజ్ఞతలు

దండారి ఉత్సవాలకు నిధులు మంజూరు చేయించినందుకు మంత్రి జూపల్లి కృష్ణారావును సోయం బాబూరావు, ఆత్రం సక్కు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జాదవ్ నరేష్, మాజీ డీసీసీ అధ్యక్షుడు షాజిద్ ఖాన్‌తో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తక్షణ రుణాల పేరుతో మోసపోవద్దు.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు!

- **"ఒక్క తొందరపాటు చెల్లింపు మీకే కాదు.. మీ కుటుంబంపైనా ప్రభావం చూపవచ్చు" -- జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్**
- **ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

అత్యవసరంగా డబ్బులు కావాలా? తక్షణ రుణం పేరుతో మీ మొబైల్‌కు వచ్చే ఆకర్షణీయమైన లోన్ ఆఫర్లను చూసి తొందరపడుతున్నారా? అయితే జాగ్రత్త! సులభంగా రుణం ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో చిక్కుకుని ఆర్థికంగా నష్టపోవద్దని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ ప్రజలను హెచ్చరించారు. తక్షణ రుణాల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల అత్యవసర ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నకిలీ లోన్ యాప్‌లు, ఆకర్షణీయమైన ఆన్‌లైన్ రుణ ఆఫర్లతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రుణం మంజూరు చేయడానికి ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ చార్జీలు, ఇతర రుసుముల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి మోసపూరిత ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లోన్ యాప్‌ల విషయంలో ఈ మూడు జాగ్రత్తలు తప్పనిసరి!

ఆగండి (PAUSE): రుణం మంజూరు చేయడానికి ముందుగానే డబ్బులు చెల్లించాలని కోరితే అప్రమత్తంగా ఉండాలి. ఆఫర్‌ను ధృవీకరించకుండా ఎలాంటి చెల్లింపులూ చేయవద్దు.

ఆలోచించండి (THINK): ఎలాంటి పత్రాలు అవసరం లేదని, క్షణాల్లో రుణం మంజూరు చేస్తామని చెప్పే ఆఫర్లను గుడ్డిగా నమ్మవద్దు. రుణం ఇచ్చే విధానం, అడుగుతున్న రుసుములు, ఆఫర్ వెనుక ఉన్న ఉద్దేశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి.

ధృవీకరించండి (VERIFY): రుణం అందించే సంస్థ విశ్వసనీయతను, అధికారిక వెబ్‌సైట్‌ను, సంప్రదింపు వివరాలను పరిశీలించాలి. సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థల వద్ద ఆ సంస్థకు ఉన్న అనుమతులు, అధికారిక రుణదాతతో దాని సంబంధాన్ని ధృవీకరించిన తర్వాతే ముందడుగు వేయాలి.



వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు వెల్లడించవద్దునకిలీ లోన్ యాప్‌లకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లు వంటి కీలక సమాచారాన్ని అందించవద్దని ఎస్పీ సూచించారు. ఆకర్షణీయమైన రుణ ఆఫర్ల వెనుక దాగి ఉన్న మోసాలను గుర్తించి, తమ కష్టార్జిత సొమ్మును కాపాడుకోవాలని కోరారు.

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయండి

ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సత్వర ఫిర్యాదు వల్ల మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని, అయితే నగదు తిరిగి వస్తుందనే హామీ ఉండదని పేర్కొన్నారు."ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి.. అడుగు వేయండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఆన్‌లైన్ రుణాల విషయంలో అప్రమత్తతే సైబర్ మోసాల నుంచి రక్షణ అని జిల్లా ఎస్పీ నితికా పంత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఐపీఎస్, ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, డి.ఫోర్.సి ఆర్ఎస్ఐ కిరణ్, ఎస్ఐ దివ్యతో పాటు డి.ఫోర్.సి బృందం సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు రూ.5 లక్షల వడ్డీలేని రుణాలు అందించాలి

- **కేంద్ర ప్రభుత్వానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ డిమాండ్**
- **పట్టణ పేదల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ఆదుకోవాలి**
- **అర్హులైన పేద కార్మికులకు రామస్వామి గట్టు వద్ద ఇళ్ల కోసం కృషి చేస్తాం**

హుజూర్‌నగర్ (ప్రజానేస్తం జ్వాల):

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ.5 లక్షల వడ్డీలేని రుణాలు అందించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లోని వర్తక సంఘం మీటింగ్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు మద్దం నాగేందర్ ముదిరాజ్ అధ్యక్షతన పట్టణ చిరు వ్యాపారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగన్న గౌడ్ మాట్లాడుతూ చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చిరు వ్యాపారులకు స్వయం ఉపాధి పథకం కింద రూ.2 లక్షల వరకు రుణాలు అందించేవారని ఆయన పేర్కొన్నారు. అనంతరం బీజేపీ ప్రభుత్వం ముద్ర పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, చిరు వ్యాపారులకు అవసరమైన స్థాయిలో రుణాలు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన ఆర్థిక భారాన్ని దృష్టిలో పెట్టుకొని చిరు వ్యాపారులకు రూ.5 లక్షల వడ్డీలేని



రుణాలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్హులైన పేదలకు ఇళ్ల కోసం కృషి

హుజూర్‌నగర్ పట్టణంలోని పేద కార్మికుల్లో అర్హులైన వారికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రామస్వామి గట్టు వద్ద ఇళ్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని నాగన్న గౌడ్ తెలిపారు. అనంతరం యూనియన్ సభ్యత్వ ఫండ్‌ను సంబంధిత సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, బ్లాక్ అధ్యక్షుడు చిట్యాల అర్‌నాథ్‌రెడ్డి, చింతకాయల రాము, లక్క వెంకన్న, రబ్బాని, మోహిను భాష, రమణ, రూప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖిలా నగర్ తూర్పుకోటలో ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం

ఖిలా వరంగల్, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

ఖిలా నగర్ తూర్పుకోట బస్తీ స్వయంసేవకుల ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. అత్తె భగీరథ్, వక్తగా డా. మంద శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. అత్తె భగీరథ్ మాట్లాడుతూ, చిన్నతనంలో తన తండ్రితో కలిసి ఆర్ఎస్ఎస్ శాఖలకు వెళ్లేవాడినని గుర్తుచేసుకున్నారు. శాఖల్లో నిర్వహించే వ్యాయామాలు, ఆటలు, దేశభక్తి గీతాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా శాఖలకు హాజరుకావడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు



క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. డా. మంద శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత అవసరాలతో పాటు దేశం, సమాజం కోసం కూడా కొంత సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. స్వయంసేవకులు వ్యక్తిగత జీవితాలను పక్కనపెట్టి దేశం, ధర్మం కోసం సేవలందిస్తున్నారని తెలిపారు. సమాజంలో సానుకూల మార్పు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, పంచ పరివర్తన సూత్రాలను ఆచరించాలని సూచించారు.

గరిడేపల్లి 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అధికారి యల్లావుల మధు.

- **అత్యవసర వైద్య పరికరాల పనితీరుపై పరిశీలన.. 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచన**

గరిడేపల్లి (ప్రజానేస్తం జ్వాల):




గరిడేపల్లి మండలంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని సూర్యాపేట జిల్లా 108 అధికారి యల్లావుల మధు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య పరికరాల పనితీరు, వాటి స్థితిగతులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆయన సమగ్రంగా పరిశీలించారు.అత్యవసర సమయాల్లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లోని అన్ని వైద్య పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 108 అంబులెన్స్ సేవలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని, విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.మండలంలో ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు లేదా ఇతర ఆపదలు ఎదురైనప్పుడు ప్రజలు వెంటనే 108కు ఫోన్ చేసి అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో సకాలంలో స్పందించి విలువైన ప్రాణాలను కాపాడటమే 108 అంబులెన్స్ సేవల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

వేలేరు మండల సమన్వయకర్తగా బిల్లా యాదగిరి నియామకం

వేలేరు, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



HANUMAKONDA DISTRICT CONGRESS COMMITTEE
N.R.R. BHAVAN, HANUMAKONDA - 506 001.
ENAGALA VENKATRAM REDDY
President

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాలు, ఒక మున్సిపాలిటీకి ఎన్నికల సమన్వయకర్తలను ప్రకటించారు. ఇందులో భాగంగా వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి నియమితులయ్యారు.ఈ సందర్భంగా బిల్లా యాదగిరి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతానని తెలిపారు. అందరి సహకారంతో పట్టభద్రుల ఓటర్లను సమన్వయం చేసుకుంటూ, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించేందుకు కృషి చేస్తానని బిల్లా యాదగిరి వెల్లడించారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి పండుగ కానుకగా నూతన వస్త్రాలు పంపిణీ చేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి

వేలేరు, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది సేవలను గుర్తించి, వారి పట్ల గౌరవాభిమానాలను చాటుకున్నారు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని గ్రామపంచాయతీకి చెందిన 18 మంది సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న కృషి, అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా గ్రామ పారిశుధ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న సిబ్బంది సేవలు వెలకట్టలేనివని అన్నారు. వారి కృషిని గుర్తిస్తూ సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా 18 మంది సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేసినట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధిలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకమని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, సౌభాగ్యం నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కాజీపేట, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

యూత్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ నాయకులు విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీలను విస్మరించి, నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆందోళన చేపట్టారు. బీజేపీ, బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షులు పున్నం వేణు ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డితో కలిసి బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు నర్మెట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ ద్వారా యువతకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం వంటి అంశాల్లో ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని వారు కోరారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను ప్రభుత్వం విడనాడాలని, హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ యువజన విధానాలపై బీజేపీ, బీజేవైఎం నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కొమురం భీం విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కోవా లక్ష్మికి ఆహ్వానం


ఇంద్రవెల్లి, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని చారిత్రక పోరాట గడ్డపై ఈ నెల 23న నిర్వహించనున్న ఆదివాసీ వీరుడు కొమురం భీం విగ్రహావిష్కరణ మహోత్సవానికి హాజరుకావాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం 'జల్--జంగల్--జమీన్' నినాదంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన కొమురం భీం త్యాగాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ చారిత్రక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మిని ఆహ్వానించిన వారిలో రాజ్ గొండ్ సేవా సమితి జాతీయ అధ్యక్షుడు సిడం అర్జు, తుడుం దెబ్బ జాతీయ నాయకుడు బుర్స పోచయ్య, తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్క బాపూరావు, గిన్నెరా రాయిసెంటర్ ఉపామెడీ కుంరం లక్ష్మన్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్క చిత్రు, మల్లాపూర్ సర్పంచ్ కనక దుందేరావు, కమిటీ సభ్యులు దుర్వ కృష్ణ, మెస్రం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు కొత్త సౌకర్యం.. 'జిప్ లైట్' కనెక్షన్ ప్రారంభం

భీమదేవరపల్లి, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) భారత్ గ్యాస్ బ్రాండ్‌పై 'జిప్ లైట్' పేరుతో తేలికపాటి వంటగ్యాస్ సిలిండర్ కొత్త కనెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సులభంగా తరలించేందుకు వీలుగా, సిలిండర్‌లో మిగిలిన గ్యాస్ స్థాయిని బయట నుంచే గుర్తించేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. ప్రకటించిన ధరల ప్రకారం సిలిండర్ ధర రూ.3,186, పత్రాల పరిశీలన రుసుము రూ.295, భద్రతా రుసుము రూ.190 కలిపి కొత్త కనెక్షన్‌కు రూ.3,671 చెల్లించాలి. గ్యాస్ నింపే ఖర్చు అదనంగా ఉంటుంది.సిలిండర్‌లో గ్యాస్ నిల్వను సులభంగా గుర్తించడంతోపాటు, తుప్పు నిరోధకత, భద్రతకు ప్రాధాన్యమిచ్చే సాంకేతికతను వినియోగించినట్లు సంస్థ తెలిపింది. ఆధార్ లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు చిరునామా వివరాలు సమర్పించి కనెక్షన్ పొందవచ్చని పేర్కొంది. హలో బీపీసీఎల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు, నాలుగు గంటల్లో ఇంటి వద్దకే సిలిండర్ సరఫరా చేసే సేవను అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.

కొత్తకొండలో శరన్నవరాత్రి వైభవం

కొత్తకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి, కాళరాత్రి దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలిరావడంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహన, చతుఃషష్టి ఉపచార పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. అర్చకులు, సిబ్బంది, రాంబాబు, జానకిపురం రవి శర్మ, వినయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విదేశీయుల వివరాలు నమోదు చేయకుంటే రూ.లక్ష జరిమానా!

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జిలు, ప్రైవేట్ హాస్టళ్లు, అద్దె ఇళ్ల యజమానులు వారి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశించారు. విదేశీయుల రాకపోకల వివరాలను 24 గంటల్లోగా ఫారమ్-III ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. విదేశీయులకు ప్రవేశం కల్పించే విద్యాసంస్థలు, చికిత్స అందించే వైద్య సంస్థలు సైతం ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. విదేశీయుల వివరాలను నమోదు చేయకపోతే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడంతోపాటు, సంబంధిత యజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

టీజీఎన్‌పీడీసీఎల్‌కు జాతీయ స్థాయి ఇన్నోవేషన్ అవార్డు

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

విద్యుత్ పంపిణీ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగానికి తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) 14వ జాతీయ స్థాయి 'ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్' అవార్డును దక్కించుకుంది. అక్టోబర్ 14న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సంస్థ కంపెనీ సెక్రటరీ కె. వెంకటేశం అవార్డును స్వీకరించారు.శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి అధికారులు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. స్కడా (SCADA), డ్రోన్ల ద్వారా విద్యుత్ లైన్ల తనిఖీలు, ఏఐ చాట్‌బాట్ వంటి సాంకేతికతలతో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. ఈ అవార్డు ఉద్యోగుల సమష్టి కృషికి గుర్తింపని పేర్కొన్నారు.



కీతవారిగూడెంలో భక్తి పారవశ్యం.. ఘనంగా లక్ష కుంకుమార్చన!





- మహాలక్ష్మి అవతారంలో శ్రీ కనకదుర్గమ్మ.. 225 మంది మహిళా భక్తులతో సామూహిక పూజలు
- అమ్మవారి ముక్కుపుడకకు వేలంపాటకు బదులు రూ.100 టోకెన్ విధానం.. మహిళా భక్తులకు ప్రత్యేక అవకాశం

కీతవారిగూడెం (ప్రజానేస్తం జ్వాల):

అమ్మవారి నామస్మరణ.. వేదమంత్రాల మంగళధ్వనులు.. మహిళా భక్తుల కుంకుమార్చనలు.. భక్తిభావంతో నిండిన ఆలయ ప్రాంగణం! సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో తొలిసారిగా నిర్వహించిన సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహాలక్ష్మి అవతారంలో కొలువుదీరిన అమ్మవారికి 225 మంది మహిళా భక్తులు, గ్రామ ఆడపడుచులు కుంకుమార్చనలు సమర్పించి అమ్మవారి కృపాకటాక్షాల కోసం ప్రార్థించారు.

225 మంది మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాలక్ష్మి అవతారంలో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ రాయప్రోలు శ్రీరామయ్య శర్మ మంత్రోచ్చారణల నడుమ సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమం భక్తిపూర్వకంగా సాగింది. వేదమంత్రాల నడుమ మహిళా భక్తులు అమ్మవారిని స్తుతిస్తూ కుంకుమార్చనలు సమర్పించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో 225 మంది మహిళా భక్తులు, గ్రామ ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. నూతన ఆలయంలో తొలిసారిగా నిర్వహించిన ఈ సామూహిక పూజ మహిళా భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది.

అమ్మవారి ముక్కుపుడకకు రూ.100 టోకెన్ విధానం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో ఆలయ కమిటీ మరో ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. అమ్మవారి ముక్కుపుడక సమర్పణకు వేలంపాట నిర్వహించే విధానానికి బదులుగా కేవలం రూ.100 టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనివల్ల ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ఎక్కువ మంది భక్తులకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.మహిళా భక్తులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ, ఆలయ కార్యక్రమాల నిర్వహణలో వారికి భాగస్వామ్యం కల్పించేందుకు ముందుకు వచ్చారు. తక్కువ మొత్తంతో భక్తులందరికీ అవకాశం కల్పించే ఈ విధానం ద్వారా అమ్మవారి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చనే ఆధ్యాత్మిక స్ఫూర్తిని చాటారు.

దాతల సహకారంతో పూజా ఏర్పాట్లు

సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో అవసరమైన పూజా సామగ్రిని సమకూర్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజల సహకారంతో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.నూతన ఆలయంలో తొలిసారిగా లక్ష కుంకుమార్చన.. 225 మంది మహిళల భాగస్వామ్యం.. అమ్మవారి ముక్కుపుడకకు రూ.100 టోకెన్ విధానం.. కీతవారిగూడెం గ్రామంలో భక్తి, ఐక్యత, సమాన భాగస్వామ్యానికి ప్రతీకగా నిలిచాయి.

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):



వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయడంతోపాటు, ఐటీ రంగంలో ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఉమ్మడి వరంగల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఆయన పేర్కొన్నారు. వరంగల్ నగరంలో అత్యాధునిక ఐటీ టవర్లను నిర్మించి, స్థానిక యువతకు, నిరుద్యోగులకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ఐటీ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తూ వరంగల్‌ను సాంకేతిక రంగానికి కీలక కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన 'కేయూ హబ్'ను ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా ఐటీ రంగ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ధర్మసాగర్ నుంచి భద్రకాళి చెరువుకు గోదావరి జలాలను తరలించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. నగర అభివృద్ధితోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. వరంగల్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు, ఉమ్మడి వరంగల్ ప్రాంత ఆర్థిక ప్రగతికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వివరించారు.

కుష్ట వ్యాధి గుర్తింపు సర్వేను విజయవంతం చేయాలి: డీఎంహెచ్‌వో

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లాలో అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు నిర్వహించనున్న కుష్ట వ్యాధి గుర్తింపు సర్వేను విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ విజయ నిర్మల, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి వ్యాధి అనుమానితులను గుర్తించాలని సూచించారు. శరీరంపై స్పర్శ తెలియని మచ్చలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాప్తిని అరికట్టవచ్చని, ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించి సర్వేను విజయవంతం చేయాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి షెడ్యూల్ విడుదల చేయాలి: మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

మఠంపల్లి, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

రైతులకు సాగునీటి షెడ్యూల్ విడుదల చేసి, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేసి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం మఠంపల్లి మండలం భీల్యానాయక్ తండా గ్రామంలో మాజీ సర్పంచ్ కోటా నాయక్ ఆధ్వర్యంలో ఎండిపోయిన పంటలను, రైతుల సమస్యలను శానంపూడి సైదిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రైతులకు సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. సాగునీరు ఎప్పుడు వస్తుందో, విద్యుత్ సరఫరా ఎలా ఉంటుందో తెలియని అయోమయంలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకుని, నష్టాల బారిన పడుతున్న రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి, ప్రభుత్వాన్ని శానంపూడి సైదిరెడ్డి కోరారు.



కాలనీలో వెలుగులు.. బస్టాండ్ వద్ద ప్రమాదానికి చెక్!

భీమదేవరపల్లి, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ఓ కాలనీలో వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు, బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ పనులను సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ప్రారంభించారు. ఏళ్లుగా వీధి దీపాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు ఈ ఏర్పాటుతో ఊరట లభించనుంది. ట్రాన్స్‌ఫార్మర్ తరలింపుతో ప్రయాణికులకు ప్రమాద ముప్పు తగ్గనుంది. కార్యక్రమంలో ఏఈ లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ ఐలయ్య, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి మోహన్, లైన్‌మెన్లు బాలరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో వివక్ష ఆరోపణలు.. విచారణకు డిమాండ్



కొత్తకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

యాదాద్రి భువనగిరి జిల్లా టి.రేపాకలో బతుకమ్మ వేడుకల సందర్భంగా దళిత మహిళల పట్ల కులవివక్షకు పాల్పడిన ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆరోపణలు నిర్ధారణ అయితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని కోరారు.కొత్తకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతకు ప్రతీక అని, అలాంటి వేడుకల్లో కులవివక్షకు తావులేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఘటనపై నిజనిర్ధారణ చేపట్టి బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తందూరు ఎల్లయ్య, బహుజన్ రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, కట్కూర్ సర్పంచ్ ముంజ బాలరాజు, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

హైదరాబాద్--అమరావతి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్లాలి

సూర్యాపేట, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

హైదరాబాద్--అమరావతి బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను జాతీయ రహదారి--65కు సమాంతరంగా సూర్యాపేట, కోదాడ మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా జేఏసీ సభ్యులు, బీజేపీ నాయకులు ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా బీజేపీ అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీని కలిసి ఈ మార్గం వల్ల జిల్లాకు కలిగే ప్రయోజనాలను వివరించారు.సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని నాయకులు పేర్కొన్నారు. వినతిపై స్పందించిన ఈటల రాజేందర్ ప్రతిపాదనను పరిశీలించి స్పందిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కడియం రామచంద్రయ్య, తుక్కాని మన్మధరెడ్డి, వంగవీటి శ్రీనివాసరావు, దండా శ్రీనివాస్‌రెడ్డి, దండా మురళీధర్‌రెడ్డి, మేడబోయిన యాదగిరి, మాలోతు శక్రు నాయక్, గుండ్ల సత్యనారాయణ, జేఏసీ కన్వీనర్ జానకిరామ్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, ధర్మార్జున్‌రెడ్డి, వనిత, సీనియర్ జర్నలిస్టు భూపతి



రాములు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులమంటూ నగల వ్యాపారి కిడ్నాప్.. రూ.15 కోట్ల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

పోలీసులమంటూ ఓ నగల వ్యాపారిని కిడ్నాప్ చేసి, కుటుంబ సభ్యుల నుంచి రూ.15 కోట్లు డిమాండ్ చేసిన ముఠా రూ.1.3 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో 10 మందిని అరెస్ట్ చేసి, నగదు, బంగారు ఆభరణాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 53 ఏళ్ల కే. శ్రీనివాసరావు అక్టోబర్ 5న రామంతాపూర్‌లోని తన నగల దుకాణానికి వెళ్తుండగా గోల్నాక ఫ్లైఓవర్ సమీపంలో ముఠా సభ్యులు కిడ్నాప్ చేశారు. కళ్లకు గంతలు కట్టి గుర్తుతెలియని ప్రాంతానికి తరలించి, కుటుంబ సభ్యులను డబ్బుల కోసం బెదిరించినట్లు విచారణలో వెల్లడైంది. బోడుప్పల్‌లోని హేమానగర్ రియల్ ఎస్టేట్ వెంచర్ వివాదమే కిడ్నాప్‌నకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రధాన నిందితుడు దుమావత్ శ్రీకాంత్ మరో ఇద్దరితో కలిసి ఆగస్టులోనే ఈ కిడ్నాప్‌కు ప్రణాళిక రూపొందించినట్లు గుర్తించారు.చిక్కడపల్లి పోలీసులు, సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించిన దర్యాప్తులో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.07 కోట్ల నగదు, 118.26 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు వాహనాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాలు మారుస్తూ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నిందితులు ప్రయత్నించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌పై గతంలో 16 చీటింగ్ కేసులు ఉన్నాయని, మరో నిందితుడిపై కూడా పలు ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని పోలీసులు



పేర్కొన్నారు. శ్రీనివాస్ రెడ్డితో సహా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మిగిలిన డబ్బు రికవరీ కోసం గాలింపు కొనసాగుతోంది.

వెంటనే డిలీట్ చేయండి.. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు: నటి నేహా శర్మ

ఏఐ మార్ఫింగ్ ఫొటోలపై నేహా శర్మ సీరియస్

ఇది తన ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్య అని ఆవేదన

అనధికార వీడియోలు, ఇమేజ్‌లను వెంటనే తొలగించాలని డిమాండ్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన ఫొటోలు, వీడియోలను అనధికారికంగా వాడుతున్న వారిపై బాలీవుడ్ హీరోయిన్ నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సృష్టించిన ఏఐ కంటెంట్ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేశారు. “నా ఫొటో లేదా పోలికలతో ఏఐ వీడియోలు, ఇమేజ్‌లు సృష్టిస్తున్న వారు వెంటనే ఆపాలి. ఇప్పటికే పోస్ట్ చేసిన కంటెంట్‌ను తక్షణమే తొలగించండి. నా గుర్తింపును ఉపయోగించి కొత్తగా ఎలాంటి ఏఐ కంటెంట్‌ను తయారుచేయవద్దు, ఎడిట్ చేయవద్దు, సర్క్యులేట్ చేయవద్దు” అని ఆమె స్పష్టం చేశారు.“ఈ విధంగా నా ముఖాన్ని ఉపయోగించి నన్ను తప్పుగా చిత్రీకరించడం లేదా నా ప్రతిష్ఠ దెబ్బతీయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నా ముఖాన్ని లేదా పోలికలను అనధికారికంగా ఉపయోగించడానికి నేను అంగీకరించను. ఈ పోస్ట్‌ను అధికారిక హెచ్చరికగా పరిగణించండి. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించిన, పోస్ట్ చేసిన, సర్క్యులేట్ చేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఫేక్ అకౌంట్లు లేదా ఏఐ టెక్నాలజీ వెనుక దాక్కుంటే శిక్ష నుంచి తప్పించుకోలేరు” అని నేహా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో నేహా శర్మ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.



మా యంగ్ లుక్ రహస్యం అదే: సైఫ్, కరీనా ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రముఖ కమెడియన్, నటుడు కపిల్ శర్మపై బాలీవుడ్ నటి కరీనా కపూర్ ప్రశంసల వర్షం కురిపించారు. కపిల్ ఒక ‘అబ్సొల్యూట్ స్టార్’ అని ఆమె అభివర్ణించారు. శనివారం సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది.ఇటీవల ‘ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ షో’లో కరీనా కపూర్ తన భర్త సైఫ్ అలీ ఖాన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ ఎపిసోడ్ షూటింగ్ తర్వాత కపిల్ శర్మ.. కరీనా, సైఫ్ మరియు ఇతర సిబ్బందితో కలిసి దిగిన ఒక సెల్ఫీని తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. “కరీనా, సైఫ్ మీతో ఇంత సరదాగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఈ అద్భుతమైన, సరదా ఎపిసోడ్ కు ధన్యవాదాలు. మీ ఇద్దరికీ నా ప్రేమ” అని ఆయన రాసుకొచ్చారు.కపిల్ పోస్టును కరీనా తన ఖాతాలో రీషేర్ చేస్తూ.. “కపిల్, నువ్వొక అబ్సొల్యూట్ స్టార్. మేము కూడా నిన్ను చాలా ఇష్టపడతాం” అని బదులిచ్చారు.ఈ షోలో సైఫ్, కరీనా తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర రహస్యాలను పంచుకున్నారు. సైఫ్ తనకు ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా మూడు సార్లు ప్రపోజ్ చేశారని కరీనా తెలిపారు. “ఆయన నాకు ముంబైలో ప్రపోజ్ చేశారు, గ్రీస్ లో ప్రపోజ్ చేశారు, పారిస్ లోనూ ప్రపోజ్ చేశారు. పారిస్ లో చెప్పినప్పుడు చివరకు నేను ‘యస్’ చెప్పాను” అని ఆమె వివరించారు. దీనిపై సైఫ్ తనదైన శైలిలో చమత్కరిస్తూ.. “నువ్వు ముంబైలోనే యస్ చెప్పి ఉంటే, నాకు చాలా డబ్బు ఆదా అయ్యేది” అనడంతో నవ్వులు పూశాయి.పెళ్లయి 14 ఏళ్లు గడిచినా ఇప్పటికీ యవ్వనంగా, తాజాగా కనిపించడానికి గల రహస్యం ఏమిటని అడగ్గా.. దానికి కారణం దేశీ నెయ్యి అని సైఫ్ చెప్పారు. తమ ఇంట్లో నెయ్యి తప్పనిసరిగా ఉంటుందని, తమ పిల్లలు తైమూర్, జెహ్ కూడా రోజూ నెయ్యి తింటారని కరీనా తెలిపారు. దీనికి సైఫ్ ఇంకొంత జోడిస్తూ, “ఆమె నెయ్యి తినడమే కాదు, రాత్రిపూట పాదాలకు కూడా రాసుకుంటుంది” అని చెప్పగా, అది నిజమేనని, అలా చేయడం వల్ల చాలా మేలు జరుగుతుందని కరీనా అంగీకరించారు.



వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



వరకట్న దురాచార నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ అన్నారు. శనివారం వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. వరకట్న వేధింపుల బాధితులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. బాలల హక్కులు, గోప్యతను కాపాడటంతోపాటు బాధితులకు పునరావాసం కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు దర్యాప్తుపై సీపీకి జర్నలిస్టుల ఫిర్యాదు

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



ఎస్సీ, ఎస్టీ కేసు (ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025) దర్యాప్తు ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ స్థానిక జర్నలిస్టులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతకు శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ వాంగ్మూలాలు నమోదు చేయకుండానే చేసినట్లు పోలీసు రికార్డుల్లో పేర్కొన్నారని, దర్యాప్తు పూర్తిచేసి కేసును మూసివేశారని జర్నలిస్టులు ఫిర్యాదులో ఆరోపించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, దర్యాప్తు ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత విచారణ జరిపించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఫిర్యాదుదారులు చేసిన ఆరోపణలపై విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికానున్నాయి.

భద్రకాళి ఆలయంలో సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం

హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



శ్రీ భద్రకాళి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీణాపాణిగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి వివిధ అలంకారాలను దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు వరంగల్ క్రీడాకారిణి లక్ష్మీ శార్వాణి ఎంపిక


హనుమకొండ, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పుల్లూరు లక్ష్మీ శార్వాణి జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో అక్టోబర్ 15న హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ద్వితీయ స్థానం సాధించింది.ఈ విజయంతో ఈ నెల 23 నుంచి 28 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయ పోటీలకు ఎంపికైన లక్ష్మీ శార్వాణిని అధ్యాపకులు, క్రీడా ప్రముఖులు అభినందించి, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

ఉద్యమకారుడు సైదులు మృతికి బీఆర్ఎస్ నేతల నివాళులు

నేరేడుచర్ల, అక్టోబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ నియోజకవర్గం, నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు సంకలబుడ్డి సైదులు అకాల మరణం పట్ల బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పిల్లుట్ల రఘు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం సైదులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా డాక్టర్ పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. సైదులు మృతి బాధాకరమని అన్నారు. దుఃఖంలో ఉన్న ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ ఉద్యమ నాయకుడు, అడ్వకేట్ నగేష్ రాథోడ్, మాజీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావుడియా శ్రీను నాయక్, నియోజకవర్గ నాయకులు ముల్కలపల్లి రాంబాబు, మాజీ సర్పంచ్ పల్లెపంగు నాగరాజు, జీలకర్ర రామస్వామి, జంపాల వెంకన్న, జింకల భాస్కర్, బుడిగ వెంకన్న, బుడిగ సతీష్, మాజీ సర్పంచ్ మేకపోతుల సైదులు, హుస్సేన్, శివాజీతో పాటు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.